అండర్‌-19 టోర్నీలో మహబూబ్‌నగర్‌ జోరు

- 254 పరుగుల తేడాతో నారాయణపేట పై ఘనవిజయం
- సెంచరీతో చెలరేగిన అబ్దుల్‌ రాఫె
- 5 వికెట్లు తీసి రాణించిన కిశోర్‌ 7

ఎదురుచూపుల.. బోనస్‌

సేకరణ పూర్తయినా.. సన్న ధాన్యానికి ప్రోత్సాహకం జమ చేయని ప్రభుత్వం

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో రూ.223.18 కోట్లు పెండింగ్‌..
- ధాన్యం డబ్బుల జమలోనూ కొంత అలస్యం
- ఇంకా కొనుగోలు కేంద్రాల వద్దే 28,504 మెట్రిక్‌ టన్నుల ధాన్యం
- యాసంగిలో ఉమ్మడి జిల్లాలో 8.13 లక్షల మెట్రిక్‌ టన్నులు కొనుగోలు



వనపర్తి జిల్లా పాన్‌గల్‌ మండలం వెంగళాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాల శాఖ కమిషనర్‌ డీఎస్‌ చౌహాన్‌(ఫైల్‌)

మహబూబ్‌నగర్‌, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తయినట్లే. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు ప్రవేశించి, వర్షాలు కూడా ప్రారంభమయ్యాయి. వానాకాలం సాగు కోసం రైతులు దుక్కులు దున్నుకోవడం, విత్తనాలు వేసుకోవడం, నారుమళ్లను సిద్ధం చేసుకోవడం వంటి పనులు చేస్తున్నారు. గత సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం రైతులందరికీ అందలేదు. కేవలం 5 ఎకరాల లోపు వారికే అందింది. ఈ సీజన్‌ ఆరంభానికి ముందే రైతు భరోసా అందించాల్సి ఉండగా, ఇంకా దానిపై ఎలాంటి ప్రకటనా ప్రభుత్వం నుంచి రావడం లేదు. ఒకవైపు పిల్లల ఫీజులు, మరోవైపు పంటల సాగు కోసం పెట్టుబడికి రైతులు అవస్థలు పడుతున్నారు. అదే సమయం లో విక్రయించిన ధాన్యం డబ్బులు ఇంకా కొంతమేర పెం డింగ్‌ ఉండగా.. సన్నాలు సాగుచేసిన వారికి బోనస్‌ ఒక్క రూపాయి కూడా విడుదల కావడం లేదు. సాగు పెట్టుబడులకు రైతులు నరక యాతన అను భవిస్తున్నారు. ఎప్పుడెప్పుడు డబ్బులు పడతాయా? అని ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.223.18 కోట్లు బోనస్‌ డబ్బులు రావాల్సి ఉంది. నారాయణపేట జిల్లాలో సన్న ధాన్యం అత్యధికంగా, నాగర్‌కర్నూలు జిల్లాలో అత్యల్పంగా విక్రయించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్‌లో దాదాపు 8.13 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం విక్రయించగా.. మహబూబ్‌నగర్‌,

(మిగతా 6లో..)

రూ.223.18 కోట్లు పెండింగ్‌లోనే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8.13 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని ఈ సీజన్‌లో రైతుల నుంచి సేకరించగా, అందులో 4.64 లక్షల మెట్రిక్‌ టన్నులు సన్న ధాన్యం విక్రయించారు. వనపర్తి జిల్లాలో 2.53 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, అందులో 96 వేల మెట్రిక్‌ టన్నుల సన్న ధాన్యానికి రూ.48 కోట్ల బోనస్‌ రావాల్సి ఉంది. నాగర్‌కర్నూల్‌ జిల్లాలో 56,525 మెట్రిక్‌ టన్నుల సన్న ధాన్యం విక్రయించగా.. రూ.28.26 కోట్లు, నారాయణపేట జిల్లాలో 1.36 లక్షల మెట్రిక్‌ టన్నుల సన్నాలను సేకరించగా.. రూ.68.26 కోట్లు, జోగులాంబ గద్వాల జిల్లాలో 78,042 మెట్రిక్‌ టన్నులకు గాను రూ.30 కోట్ల మేర బోనస్‌ డబ్బులు రావాలి. మహబూబ్‌నగర్‌ జిల్లాలో 97,329 మెట్రిక్‌ టన్నులకు గాను రూ.48.66 కోట్లు బోనస్‌ ఇవ్వాల్సి ఉంది. మొత్తం కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.223.18 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క రూపాయి కూడా ఇప్పటివరకు విడుదల కాలేదు. అధికారుల వద్దకు బోనస్‌ డబ్బుల కోసం తిరుగుతున్నా, ప్రభుత్వం నుంచి రాలేదని చెబుతుండటంతో రైతులు నిరాశ చెందుతున్నారు. బోనస్‌ డబ్బులు గత సీజన్‌లో పూర్తిగా జమ అయినప్పటికీ.. అప్పుడు కూడా ఆలస్యమైంది. దీనివల్ల సన్నాల సాగువైపు మళ్లుతున్న రైతులు దిగుబడి ఎక్కువగా వస్తుందని తిరిగి దొడ్డురకాల సాగువైపు మళ్లే అవకాశం ఉంది.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- వనపర్తి కలెక్టర్‌ ఆదర్శ్‌ సురభి

శ్రీరంగాపూర్‌, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని వనపర్తి కలెక్టర్‌ ఆదర్శ్‌సురభి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్‌, శ్రీరంగాపూర్‌ మండలంలోని నాగసానిపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు మీ గ్రామానికి వచ్చారని, భూ సమస్యలు ఏమున్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించు కోవాలని సూచించారు. సాదా బైనామాపై వివరిస్తూ 2020 సంవత్సరంలో ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. మిగిలిన సాదాబైనామా దరఖాస్తులను కోర్టు సూచన మేరకు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నాగసానిపల్లిలోని చౌక ధర దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పెబ్బేరు మండలంలోని పాతపల్లి ఐకేపీ సెంటర్‌ను తనిఖీ చేసి ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సివిల్‌ సప్లై అధికారి విశ్వనాథ్‌, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, శ్రీరంగాపూర్‌ తహసీల్దార్‌ రాజు, పెబ్బేరు తహసీల్దార్‌ మురళి, ఆర్‌ఐ ఇతర సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నాగసానిపల్లి రేషన్‌ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వనపర్తి కలెక్టర్‌ ఆదర్శ్‌సురభి

రిజర్వాయర్‌ మాకొద్దు



అనంతపురం ప్రాంతంలో రిజర్వాయర్‌ నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకుంటున్న రైతులు

- సర్వే పనులను అడ్డుకున్న రైతులు

- భారీగా పోలీసులు మోహరింపు

బల్మూరు, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి): ఈ రిజర్వాయర్‌ మాకొద్దని ఉమామహేశ్వర రిజర్వాయర్‌ నిర్మాణం కోసం చేపడుతున్న సర్వేను రైతులు గురువారం అడ్డుకున్నారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా బల్మూరు మండలంలోని అనంతవరం, అంబగిరి, బల్మూరు,మైలారం గ్రామాల సమీపంలో రిజర్వాయర్‌ నిర్మాణం కోసం చేపడుతున్న భూ సర్వేలను రైతులు ఆయా ప్రాంతాల్లో అడ్డుకున్నారు. సర్వే అధికారులు పోలీసు బందోబస్తు మధ్య 5 బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లో సర్వే చేస్తుండగా ఆయా గ్రామాల రైతులు వారితో గొడవ పడ్డారు. బుధవారం నోటీసులు జారీ చేసిన గురువారమే వ్యవసాయ పొలాలకు సర్వే కోసం రావడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. రైతులను సముదాయించేందుకు పోలీసులు ప్రయత్నం చేశారు. పోలీసులతో ఉద్యమాన్ని ఆపలేరని రైతులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మైలారం, అంబగిరి, అనంతవరం, బల్మూరు గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- పెద్ద ధన్వాడ గ్రామంలో సమావేశమైన రైతులు, గ్రామస్థులు
- తమపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్‌ 6



సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న ఇథనాల్‌ కంపెనీ బాధిత రైతులు

అనగనగా ఓ కుటుంబం

గూడు లేదాయె.. అప్పులు భారమాయె..

- 25 ఏళ్లుగా ప్రభుత్వ ఇంటికోసం ఎదురుచూస్తున్న అభాగ్యులు
- అద్దె చెల్లించే స్తోమత లేక బడిలో తలదాచుకుంటున్న దంపతులు 7

ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



పోచమ్మ ఆలయ శిఖరం కలశాన్ని ప్రతిష్ఠాపనకు తీసుకువెళ్తున్న భక్తులు 7

తాటి చెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడి మృతి

- నాగర్‌కర్నూల్‌ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలో ఘటన



మల్లేశ్‌ (ఫైల్‌)

తాడూరు, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి) : కల్లు గీసేందుకు తాటి చెట్టు పైకి ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెం దాడు. నాగర్‌కర్నూల్‌ జిల్లా, తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మల్లేశ్‌ (42) గురువారం తెల్లవారుజామున కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. కల్లు తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడిపోయాడు. సమీపంలో ఉన్న గ్రామస్థులు పరిశీలించగా ఎలాంటి స్పందన లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో అతడి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అక్కడి నుంచి నాగర్‌కర్నూల్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై అతడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మల్లేశ్‌ కుటుంబాన్ని ఆదుకోవాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రాజుగౌడ్‌, సిర్సవాడ గీత కార్మిక సంఘం సభ్యులు డిమాండ్‌ చేశారు.

బాస్కెట్‌బాల్‌ చాంపియన్‌ హైదరాబాద్‌ 6

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

- నాగర్‌కర్నూల్‌ కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌



నాగర్‌కర్నూల్‌ పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీలో కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌

నాగర్‌కర్నూల్‌, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని నాగర్‌కర్నూల్‌ కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్‌ పురపాలక సంఘం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్‌ అధ్యక్షతన ఒక మార్పు-అభివృద్ధికి మలుపు-స్వచ్ఛతపై తొలి అడుగు అనే నినాదంతో నాగర్‌కర్నూల్‌ పట్టణంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్‌ ప్రారంభించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నామని, చెట్లు నీడ ఇవ్వడంతోపాటు ఆక్సిజన్‌ అందిస్తాయని అన్నారు. చెట్లను పెంచడం నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఆక్సిజన్‌ కొనుకొక్కునే పరిస్థితి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్‌ మునిసిపల్‌ కమిషనర్‌ నరేష్‌బాబు, పొల్యూషన్‌ బోర్డు కంట్రోల్‌ అధికారి దివ్య, మెప్మా మేనేజర్‌ సోఫియా, వివిధ శాఖల అధికారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికోసం నిరీక్షణ

- రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేయాలి
- జిల్లాలో పైలట్‌ ప్రాజెక్టు కింద 861 ఇళ్లు మంజూరు
- కొన్ని గ్రామాల్లో నేటికీ ప్రకటించని ఇళ్ల లబ్ధిదారుల జాబితా



కొల్లాపూర్‌ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కొనసాగుతున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

కొల్లాపూర్‌, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాపాలనలో భాగంగా అర్హుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ముందుగా నాగర్‌ కర్నూల్‌ జిల్లా పరిధిలోని కొల్లాపూర్‌, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌, కల్వకుర్తి నియోజకవర్గంలో ఉన్న 20 మండలాల్లో పైలట్‌ ప్రాజెక్టు కింద జిల్లా వ్యాప్తంగా 861 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో 503 ఇళ్లకు అధికారులు మార్క్‌ చేశారు. అందులో 233 ఇళ్లు బేస్‌మెంట్‌ వరకు పూర్తయ్యాయి. ఇప్పటికే మొదటి విడతలో భాగంగా 120 మంది లబ్ధిదారుల ఖాతాలలో ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున రూ.1.20 కోట్లు జమ చేశారు. మిగిలిన 113 మంది లబ్ధిదారుల ఖాతాలలో వారం రోజుల్లోపు జమ కానున్నాయని జిల్లా హౌసింగ్‌ శాఖ అధికారులు తెలిపారు. నాగర్‌కర్నూల్‌ జిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో ప్రతీ నియోజకవర్గం నుంచి మండలాల వారీగా ఒక గ్రామాన్ని పైలట్‌ ప్రాజెక్టు కింద తీసుకుని గ్రామాల్లో అర్హులను ఎంపిక చేశారు. మిగతా గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. ఇందిరమ్మ కమిటీ విడుదల చేసే జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. రాజకీయాలకతీతంగా ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్‌ జిల్లాలో పైలట్‌ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల వివరాలు

మండలం	గ్రామం పేరు	కలెక్టర్‌ ఆమోదించినవి
అచ్చంపేట	అంకిరావుపల్లి	24
అమ్రబాద్‌	తుర్కపల్లి	34
బల్మూరు	జినుకుంట	73
బిజినపల్లి	అలిపూర్‌	70
చారకొండ	గోకారం	57
కల్వకుర్తి	రఘుపతిపేట్‌	130
కోడేర్‌	పసుపుల	10
కొల్లాపూర్‌	అమరగిరి	24
లింగాల	అవుసలికుంట	45
నాగర్‌కర్నూల్‌	పెద్దాపూర్‌	41
పదర	గంగుపెంటతండా	30
పెద్దకొత్తపల్లి	చంద్రబండతండా	21
పెంట్లవెల్లి	యంగంపల్లి తండా	47
తాడూరు	గుట్టలపల్లి	21
తెల్కపల్లి	గౌరెడ్డిపల్లి	22
తిమ్మాజీపేట	ఇప్పలపల్లి	82
ఉప్పునుంతల	మొల్గర	37
ఉర్కొండ	నర్సంపల్లి	16
వంగూరు	మిట్టసగూడ	53
వెల్దండ	చెర్కూరు	24
	మొత్తం	861

పాతాళగంగ విద్యుత్‌లైన్‌ పదిలమేనా..?

- అడ్డదిడ్డంగా స్తంభాల ఏర్పాటు

- కాంట్రాక్టర్‌ ఇష్టానుసారంగా చేస్తున్న పనులు



ఈగలపెంట సమీపంలో శ్రీశైలం-హైదరాబాద్‌ ప్రధాన రహదారి పక్కన నాటిన కరెంటు స్తంభం

దోమలపెంట, జూన్‌ 5 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ సరిహద్దు ప్రాంతం అచ్చంపేట నియోజక వర్గంలోని ఎడమ పాతాళ గంగ గ్రామానికి నేటికీ అంధ్రప్రదేశ్‌ నుంచి విద్యుత్‌ సరఫరా అవుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అచ్చంపేట ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం దోమలపెంట నుంచి ఎడమ పాతాళ గంగ వరకుత్రీ ఫేజ్‌ విద్యుత్‌ లైన్‌ ఏర్పాటు చేసేందుకు సుమారు రూ. 18 లక్షల నిధుల కేటాయించింది. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ దోమలపెంట నుంచి ఎడమ పాతాళగంగ వరకు 30 స్తంభాల ఏర్పాటు, 650 మీటర్ల దూరం 11 కేవీ కేబుల్‌ ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఎడమ పాతాళగంగ వరకు నాటే స్తంభాలు శ్రీశైలం-హైదరాబాద్‌ ప్రధాన రహదారి పక్కనే పాతారు. స్తంభాల గోతుల్లో రాళ్లు పేర్చి తుతూ మంత్రంగా కాంక్రీట్‌ వేయడంతో స్తంభాలు రోడ్డు వైపుకు ఒరిగిపోతున్నాయి. పనులు నాసిరకంగా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పాతాళగంగ గ్రామస్థులు వాపోతున్నారు. అదేవిధంగా ఇది వరకు ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్‌ సరఫరా కావడంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకానికి నోచుకోలేదు. ఇప్పుడు తెలంగాణ ప్రాంతం నుంచే విద్యుత్‌ సరఫరా చేసి ఉచిత విద్యుత్‌ పథకం అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లోపాలుంటే సరి చేస్తాం..

విద్యుత్‌ లైన్‌ ఏర్పాటులో లోపాలు ఉంటే కాంట్రాక్టర్‌ సరిగ్గా చేయకపోతే చర్యలు తీసుకుంటాం. ఎటువంటి లోపాలున్నా సరి చేయిస్తాం. తొందరలోనే పనులు పూర్తి చేసి ఉచిత విద్యుత్‌ పథకం వర్తించేందుకు చర్యలు తీసుకుంటాం.

- రమేశ్‌, ట్రాన్స్‌కో ఏఈ, అమ్రాబాద్‌

భారీ కొండ చిలువ పట్టివేత



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి సర్వేశ్వర్‌రెడ్డి మామిడి తోటలో 15 అడుగుల భారీ కొండ చిలువను పట్టుకున్నారు. తోటలో కొండ చిలువ ఉందని సర్వేశ్వర్‌రెడ్డి ఎస్‌ఐ శివకుమార్‌కు తెలిపారు. ఎస్‌ఐ సాగర్‌ స్నేక్‌ సొసైటీ చీర్ల కృష్ణసాగర్‌కు సమాచారం ఇచ్చారు. కృష్ణసాగర్‌ తోట దగ్గరకు చేరుకొని 15 అడుగులు, 30 కేజీల భారీ కొండ చిలువను బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత భారీ పామును చూడటం ఇదే మొదటి సారి అని, పామును ఫారెస్టు అధికారుల సూచన మేరకు తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు. - పెద్దమందడి



విజేత హైదరాబాద్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి బీ పాపిరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు



రన్నర్ రంగారెడ్డి పురుషుల జట్టుకు విజేత హైదరాబాద్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి బి. పాపిరెడ్డి

బాస్కెట్‌బాల్ చాంపియన్ హైదరాబాద్

- రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్, రంగారెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 1వ తెలంగాణ అంతర్ జిల్లాల అండర్-23 3-3 మహిళ, పురుషుల బాస్కెట్ బాల్ టోర్నీ చాంపియన్‌గా హైదరాబాద్, రన్నర్‌గా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు నిలిచాయి.

గురువారం బాలురు పురుషుల విభాగంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు రంగారెడ్డిపై 14-12తో, మహిళా విభాగంలో హైదరాబాద్ జట్టు మహబూబ్‌నగర్‌పై 21-04తో గెలిచి రెండు విభాగాల్లో హైదరాబాద్ విజేతగా నిలిచింది. మహిళా విభాగంలో మహబూబ్‌నగర్, పురుషుల విభాగంలో రంగారెడ్డి జట్లు రన్నర్‌గా నిలిచాయి.


ఫైనల్‌లో తలబడుతున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి మహిళ జట్లు

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమాని, క్రీడా స్ఫూర్తిని చాటాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి బి. పాపిరెడ్డి అన్నారు. స్టేడియం మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేతలకు జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి బి. పాపిరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్ మాట్లాడు తూ మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఇండోర్‌స్టేడియంలో ఏసీ, క్రీడామైదానలు ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తాం

- శాట్ చైర్మన్ శివసేనారెడ్డి

జిల్లాలో త్వరలోనే క్రీడా పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడాభివృద్ధికి రూ. 112 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత గత రెండేళ్లలో రూ. 850 కోట్ల బడ్జెట్ క్రీడలకు కేటాయించామని తెలిపారు. తెలంగాణ క్రీడల్లో మొదటి స్థానంలో ఉండాలని, క్రీడాకారులు తయారు చేసే కర్మాగారంగా మన రాష్ట్రం ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికైన విషయాన్ని గుర్తుచేశారు. క్రీడాహబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రావుల శ్రీధర్‌రెడ్డి, పృదీశ్వర్‌రెడ్డి, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, బార్‌అసోసియేషన్ సెక్రటరీ శ్రీధర్‌రావు, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, నసూరుల్లా హైదర్ మహ్మద్, బాస్కెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు సుబహాన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలేద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, గోపాల్, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్న వీరయ్య, సీనియర్ క్రీడాకారిణి గీత, పీడీ ముక్రం, బాల్‌రాజ్, షకీల్ విశాల్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



రన్నర్ మహబూబ్‌నగర్ మహిళా జట్టుకు విజేత హైదరాబాద్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి బి. పాపిరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు


తలబడుతున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి క్రీడాకారులు

పేట మునిసిపాలిటీకి గ్రీన్ చాంపియన్ అవార్డు

నారాయణపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో అద్భుత ప్రదర్శన కనబరిచిన నారాయణపేట మునిసిపాలిటీకి తెలంగాణ పొల్యూషన్ బోర్డు తరపున గ్రీన్ చాంపియన్ అవార్డును హైదరాబాద్‌లో గురువారం మంత్రి కొండా సురేఖ పేట మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లుకు అందించారు. నారాయణపేట మునిసిపాలిటీలో సేకరించిన చెత్తను వంద శాతం పునర్వినియోగంలోకి తీసుకువచ్చి తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును, పొడి చెత్త నుంచి పరిశ్రమల్లో మండుటకు వినియోగించే బ్రికెట్స్ తయారీ, ప్లాస్టిక్ నుంచి మండే స్వభావం గల ఆయిల్ తయారీ లాంటి పునర్వినియోగ వస్తువులను తయారు చేస్తు కాలుష్య నియంత్రణకు పాటు పడుతుండడంతో ఈ అవార్డు వరించింది. వరుసగా రెండోసారి ఈ అవార్డు ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజునే నారాయణపేట మునిసిపాలిటీ అందుకోవడం విశేషం.



మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా గ్రీన్ చాంపియన్ అవార్డు అందుకుంటున్న పేట మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- పెద్ద ధన్వాడ గ్రామంలో సమావేశమైన రైతులు, గ్రామస్థులు
- తమపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్

రాజోలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : విషపూరితమైన ఫ్యాక్టరీని నిర్మించొద్దని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని పెద్ద ధన్వాడ గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలోని రైతు వేదిక వద్ద వారు సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బుధవారం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును 12 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తూ నిరసన తెలిపామని అన్నారు. ఈ నిరసనలో 12 మందిని రిమాండ్‌కు తరలించడం దారుణమని, రిమాండ్‌కు తరలించిన వారిని వెంటనే విడుదల చేసి, కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఫ్యాక్టరీ నిర్మాణం పనులు చేపడితే అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. రాజోలి ఎస్ఐ జగదీశ్వర్‌ను వివరణ కోరగా.. మంగళవారం రైతులు ఫ్యాక్టరీ నందు నిరసన చేపడితే సర్దిచెప్పి పంపించాం, బుధవారం ఉదయం ఫ్యాక్టరీ ముదు నిరసన చేపడుతున్నారని తెలుసుకుని బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కాని గ్రామస్థులు పోలీసులను లెక్కచేయకుండా ఒక్కసారిగా ఫ్యాక్టరీని చుట్టుముట్టి ఫ్యాక్టరీకి సంబంధించిన వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ ఘటనలో తీసిన వీడియోల ఆధారంగా కొందరిని అదుపులోకి తీసుకుని మానవపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. దాడులకు పాల్పడిన 41 మందిపై కేసులు నమోదు చేసి అనుమానితులను గుర్తించి 12 మందిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించిన 12 మందిలో పెద్ద ధన్వాడకు చెందిన బోయ నర్సింహులు, కే నర్సింహులు, భరత్ కుమార్, చిన్న నాగేంద్ర, నల్లబోతుల కాటన్, చిన్న ధన్వాడకు చెందిన పరశురాముడు, శివగౌడు, సూర్య ప్రకాష్, భీమన్న, మనోహర్, ఏసన్న, నాగేంద్రలు ఉన్నారు.

వీరిని కోర్టు హాజరుపరిచిన అనంతరం 14 రోజుల రిమాండ్ విధించి మహబూబ్ నగర్ జైలుకు తరలించారు. ఈ విచారణలో మరి కొందరిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన కాయకల్ప బృందం సభ్యులు

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కాయకల్ప బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఎక్స్‌టర్నల్ అసెస్మెంట్‌లో భాగంగా కాయకల్ప క్వాలిటీ బృందం డాక్టర్లు శ్రీదేవి రాజన్, మౌనిక ప్రియదర్శిని ఆసుపత్రిలోని రికార్డులను పరిసరాలను అన్ని విభాగాలను తనిఖీ చేసి సమీక్ష నిర్వహించారు. గతంలో కాయకల్ప ఇంటర్నల్ అసెస్మెంట్‌లో 80శాతం మార్కులు రావడంతో ఇప్పుడు ఎక్స్‌టర్నల్ సెంట్రల్ బృందం పరిశీలించిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ షకీల్, డాక్టర్ యశోదబాయి, డాక్టర్ ప్రభు, డాక్టర్ శివ, డాక్టర్ వసంతాదేవి, సుష్మ, ఉదయ్, శిరీష, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ జాయి మేర్సీ, బాలమణి, సునీత, సీనియర్ ఫార్మసిస్టు షైఖేల్, మనోహర్, కవిత, రేడియాలజిస్టు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

- కల్వకుర్తిలో బంధువుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, బంధువులు

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని తాండ్ర సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన చరణ్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో కుటుంబీకులు, బంధువులు రాస్తారోకో చేశారు. చారకొండ మండలం జూపల్లికి చెందిన చరణ్ తమ స్వగ్రామం నుంచి కల్వకుర్తికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ అజాగ్రత్తగా వచ్చి ఢీ కొట్టడంతో అతను మృత్యువాత పడ్డాడు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపి రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చివరకు పోలీసులు వారికి నచ్చజెప్పి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చి అక్కడి నుంచి తీసుకెళ్లారు.

అల్ప్రాజోలం పట్టివేత

- ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పెబ్బేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలో కల్లులో కలిపే నిషేధిత పదార్థం అల్ప్రాజోలం పట్టుబడిన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై గంగిరెడ్డి యుగేంధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన నరసింహగౌడ్, గట్టు మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ గౌడ్‌లు గురువారం సాయంత్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో 500గ్రాముల అల్ప్రాజోలం విక్రయిస్తుండగా పక్క సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. కర్నూల్ జిల్లాకు చెందిన హర్షవర్ధన్ గౌడ్, జగదీష్‌గౌడ్, గోపాల్‌గౌడ్‌ల దగ్గర నరసింహగౌడ్ అల్ప్రాజోలం తీసుకువచ్చి భాస్కర్ గౌడ్‌కు విక్రయించాడు. ఇట్టి అల్ప్రాజోలం పదార్థాన్ని భాస్కర్‌గౌడ్ కల్లు దుకాణాలు నడుపుతున్న అనంతపురం జిల్లాకు చెందిన కుమార్‌గౌడ్, కర్నూల్ జిల్లాకు చెందిన లక్ష్మన్నగౌడ్, పండ్ల రమేష్, గజేంద్రగౌడ్, నాగర్‌కర్నూల్‌కు చెందిన యుగేంధర్ గౌడ్‌లకు విక్రయిస్తుంటాడని తెలిపారు. ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న అల్ప్రాజోలం పదార్థాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మిగతా నేరస్థులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మునిసిపల్ కమిషనర్ పేరుతో బెదిరింపు కాల్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యాపారులు

అమరచింత, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కమిషనర్ రవి బాబు అంటూ పలువురు వ్యాపారులకు పన్నులు చెల్లించాలని ఒత్తిడి తేవడంతో పాటు బెదిరింపు కాల్స్ చేస్తున్నారని గురువారం పలువురు అమరచింత పోలీస్‌స్టేషన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ... గత రెండు రోజులుగా వెంటనే మునిసిపల్ పన్ను డబ్బులు చెల్లించాలని స్కానర్ వాట్సాప్‌కు పంపుతున్నానని, వెంటనే డబ్బులు వేయాలని కమిషనర్ పేరుతో ఒత్తిడి తెస్తున్నాడని వారన్నారు. ఆఫీస్‌కు వచ్చి డబ్బులు కడతామని.. ఉంటే కలెక్టర్ ఆఫీసులో ఉన్నాను.. వెంటనే డబ్బులు వేయండి అని ఒత్తిడి తేవడంతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై అందరూ వ్యాపారులందరూ కలిసి గురువారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలువగా అలాంటి కాల్స్ నేనెప్పుడు చేయను, పన్నులు వసూలు చేసేది సిబ్బంది వస్తారని చెప్పుకొచ్చారు. దీంతో అవాక్కైన వ్యాపారులు పోలీస్ స్టేషన్‌లో ఆ ఫోన్ నెంబర్‌పై ఫిర్యాదు చేసినట్లు ప్రజా వైద్యశాఖ డాక్టర్ శివశంకర్ రెడ్డి, అక్షయ మెడికల్ అఖిల్, హోమ్ లక్ష్మి ట్రేడర్స్ తిమ్మారెడ్డి తెలిపారు.

అనుమతి లేకుండా ఔషధాల విక్రయం నేరం

- ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్‌కుమార్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనుమతి లేకుండా ఔషధాలు విక్రయించే మెడికల్ దుకాణాలు, ఆర్ఎంపీ క్లినిక్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔషధ నియంత్రణ శాఖ అనుమతులు తీసుకోకుండా మత్తు మందులు విక్రయించడం, నిల్వలు ఉంచుకోవడం, ఆర్ఎంపీ క్లినిక్‌లలో ఔషధాలు విక్రయించడం నేరమన్నారు. అలాంటి దుకాణాలు, క్లినిక్‌ల యాజమాన్యాలకు కేసులు నమోదు చేయడంతో పాటు జైలు శిక్ష, జరిమానాలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ దుకాణాలలో ఏవైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వారికి నోటీసులు జారీ చేయాలని అన్నారు. ఆయా జిల్లాల్లో ఉన్న రక్తనిల్వ కేంద్రాలను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేయాలన్నారు. అదేవిధంగా నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు, వాటిని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీ నెల మెడికల్ దుకాణాలు, ఆర్ఎంపీ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, ప్రైవేటు ఆసుపత్రుల్లోని మెడికల్ దుకాణాలను తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రఫీ, రబీయా, రష్మీ, విశ్వంత్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా..

కొత్తకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయండి.. మీ సమస్యలు పరిష్కారానికి నేను బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పీఆర్టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పాఠశాలలో గతం కంటే ఎక్కువగా ఎన్‌రోల్‌మెంట్ పెరిగే విధంగా చూడాలన్నారు. ఈ ఏడాది 16.8 లక్షల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలకు విద్యార్థులను పెంచాలన్నారు. గత పది రోజుల నుంచి జిల్లాలో పర్యటించి విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం ఉపాధ్యాయులతో సమావేశాలు చేపట్టుతున్నామన్నారు. ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు జూన్ నెలలో విడుదల చేయక పోతే ప్రత్యక్ష కార్యాచరణ తీసుకొని బిల్లులు సాధిస్తామన్నారు. సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డులు కార్పొరేట్ హాస్పిటల్‌లో పని చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ను ముందు పెట్టడం జరిగిందని వివరించారు.

సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షకార్యదర్శులు బొద్దారెడ్డి, చంద్రశేఖర్, భక్తరాజ్, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి

వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అందించే సబ్సిడీ వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 41 మంది రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్లు, పైపులు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో పాటు ధాన్యం కొనుగోలు, రైతు బరోసా వంటి పథకాలను అమలు చేసి రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలో రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ దామోదరెడ్డి

ఎదురుచూపుల 'బోనస్'

(5వ పేజీ తరువాయి)

నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అత్యధికంగా సన్నాల విక్రయాలు జరిగాయి. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎక్కువగా దొడ్డు రకాలను రైతులు సాగు చేశారు.

28 వేల మెట్రిక్ టన్నులు కల్లాల్లోనే..

గత సీజన్‌లతో పోలిస్తే ఈసారి రైతులు ధాన్యం విక్రయానికి చాలా ఇబ్బందులు పడ్డారు. మిల్లర్లు, రవాణా గుత్తేదారులు కుమ్మక్కు కావడం, సన్న రకాలను ముందుగా ఎత్తుతూ దొడ్డు రకాలను అలాగే వదిలేయడం, అకాల వర్షాలు కురవడం, తూకం అయినా రోజుల తరబడి లారీలు రాకపోవడం వంటి కారణాలతో అవస్థలు పడ్డారు. పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకలు రావడం, తడిసి నల్లగా మారడం కూడా జరిగాయి. అలాగే ముందే వచ్చిన నైరుతి కూడా కంటతడి పెట్టించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు కంటా అంతా అయిపోయినప్పటికీ ఇంకా కల్లాల వద్ద 28,504 మెట్రిక్ టన్నుల ధాన్యం అలాగే ఉంది. అవి మిల్లుకు పోయి, తక్‌పట్టీలు వచ్చే వరకు రైతులే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. దీనికి కారణం రైస్ మిల్లర్లు దొడ్డు రకాలను తీసుకోకపోవడం, రవాణా టెండర్లు దక్కించుకున్న వారు లారీలను సరిగా సమకూర్చుకోలేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఒక్క వనపర్తి జిల్లాలోనే ఇంకా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా, నాగర్‌కర్నూలు, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఇంకా కల్లాల వద్ద ధాన్యం ఉంది. అలాగే బోనస్ కాకుండా ధాన్యం డబ్బులు ఇంకా రూ.224.11 కోట్లు ఉమ్మడి జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.1,681.07 కోట్లకు గాను.. రూ.1,456.11 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి.

నేటి నుంచి బడి బాట

- నేడు గ్రామసభల నిర్వహణ
- పాఠశాల ప్రవేశాలకు శ్రీకారం చుట్టాలి

నారాయణపేట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం నుంచి ఈనెల 19 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ నిర్వహించనుంది. మొదటి రోజు గ్రామ సభల్లో అందులో మహిళా సంఘాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, స్కూల్ టీచర్లు, తల్లిదండ్రులు, చదువుతున్న విద్యార్థులతో నిర్వహించాలి. అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించి ప్రవేశాలకు శ్రీకారం చుట్టాలి. 7న ప్రతి ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గర్తించాలి. 8 నుంచి 10 వరకు కరపత్రాలతో ఇంటింటా ప్రచారం నిర్వహించాలి. అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించాలి. డ్రాప్ ఔట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలి. 12న పాఠశాలల పునఃప్రారంభం ఘనంగా నిర్వహించి అమ్మ ఆదర్శకమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు అందించి తల్లిదండ్రుల సమావేశం నిర్వహిచాలి.

13న ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం, ఉన్నత పాఠశాలల్లో బాల సభ నిర్వహించాలి. 16న ఎఫ్ఎల్ఎన్ అండ్ ఎల్ఐపీ దినోత్సవం నిర్వహించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాలి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 339, ప్రాథమికోన్నత పాఠశాలలు 86, ఉన్నత పాఠశాలలు 76 ఉన్నాయి. 55,278 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా 2290 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- వ్యక్తి మృతి

వెల్దండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై గురువారం రాత్రి బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఆమనగల్లు పట్టణానికి చెందిన నారమోని మల్లేష్(38) అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వెల్దండలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్న మల్లేష్ తన స్వగ్రామమైన ఆమనగల్లుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో ఆమనగల్లు వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొంది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య బాగ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు.

క్రైం కార్నర్

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ఎర్రవల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని కొట్టం కాలేజీ దగ్గర 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ వెంకటేశ్వర్లు(62) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌తో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ట్రాక్టర్ ఓనర్ వెంకటేష్ కొత్తకోట మండలం జంగమాయపల్లిలో కౌలుకు వేసుకున్న భూమిని దున్నేందుకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరాడు. ప్రమాదవశాత్తు కొట్టం కాలేజీ దగ్గర కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న మార్గంలో ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. సంఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

నగదు, వెండి చోరీ

ఖిల్లాఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన దేవరశెట్టి వెంకటేష్ ఇంటిలో గురువారం దొంగలు పడ్డారు. 30వేల నగదు, ఏడున్నర తులాల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు దేవరశెట్టి వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తాను నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాను. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగిలి ఉందని తెలిపారు. ఇంటిలోకి వెళ్లి చూడగా అల్మారాలో బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. ఏడున్నర తులాల వెండి, 30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని వివరించారు.

కంప్యూటర్ దొంగల అరెస్టు


ఖిల్లాఘణపురం పోలీస్ స్టేషన్ ఆవరణంలో కంప్యూటర్ దొంగలతో ఎస్ఐ సురేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది

ఖిల్లాఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంప్యూటర్ చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ సురేష్ గౌడ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లాఘణపురం ఏఈవో సునీత రైతు వేదికలో వీసీ యూనిట్‌లోని సీపీయూ, మానిటర్, కీబోర్డు మొదలైన వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని మే 30వ తేదీన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొత్తకోట సీఐ రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. గురువారం వెంకటాంపల్లి గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో సీపీయూ మానిటర్, కీబోర్డు వేసుకుని వెళ్తున్న ఆగారం గ్రామానికి చెందిన చిట్యాల మాధవులు, తిక్క మన్యమయ్య, నాగార్జున అనే నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. మే నెల 29న రాత్రి నిందితులు ముగ్గురు రైతు వేదిక వద్ద మద్యం సేవించి నాగార్జునను కాపలాగా ఉంచి మాధవులు, మన్యమయ్య రైతు వేదిక లోపలికి వెళ్లి కంప్యూటర్ వస్తువులను చోరీ చేశారు. ఆటోలో ఆగారం గ్రామానికి తరలించి మాధవులు ఇంటిలో దాచి ఉంచారు. అనుమానం రాకుండా గురువారం కంప్యూటర్ వస్తువులను అమ్మడానికి తరలిస్తుండగా దొరికిపోయినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. దొంగతనం కేసును వేగవంతంగా దర్యాప్తు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎస్ఐ సురేష్ గౌడ్, కానిస్టేబుళ్లు లింగం, రాజు, చైతన్య కుమార్, మనోహర్‌ను ఎస్పీ గిరిధర్, గ్రామ పెద్దలు ఆగారం ప్రకాష్, బెస్త శ్రీనివాసులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి జైలు శిక్ష


ఊర్కొండలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణదేవ

ఊర్కొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి ఒకరోజు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఊర్కొండకు చెందిన దార రమేష్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తుండగా మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా మరో ఇద్దరు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారని వారిని కల్వకుర్తి కోర్టులో హాజరు పరుచగా జడ్జి కావ్య దార రమేష్‌కు ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.600 జరిమానా, మరో ఇద్దరికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి డ్రైవింగ్ చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరుసగా నాలుగవ విజయం సాధించిన జడ్చర్ల క్రికెట్ జట్టు


జడ్చర్లలోని మినీస్టేడియంలో వరుసగా నాలుగవ విజయం సాధించిన జడ్చర్ల జట్టు

జడ్చర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ పోటీల్లో భాగంగా జడ్చర్ల మినీస్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతున్నాయి. గురువారం జడ్చర్ల, వనపర్తి జట్ల మధ్య రసవత్తరంగా మ్యాచ్ సాగింది. వనపర్తి జట్టుపై 6వికెట్ల తేడాతో జడ్చర్ల జట్టు విజయం సాధించింది. ఈ టోర్నీలో వరుసగా నాలుగవ విజయాన్ని జడ్చర్ల జట్టు సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదటి బ్యాటింగ్ చేసిన వనపర్తి జట్టు నిర్ణీత 50ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 258 పరుగులు సాధించింది. వనపర్తి జట్టులోని హర్ష 64 పరుగులు, మహేష్‌నాయక్ 58, ఫర్హాద్ 52 పరుగులు చేశారు. జడ్చర్ల జట్టులోని శ్రీసాయి 4వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన జడ్చర్ల జట్టు 44 ఓవర్లలోనే 4వికెట్లను కోల్పోయి 259 పరుగుల లక్ష్యాన్ని చేధించింది. జడ్చర్ల జట్టులో అక్షయ్‌సాయి 74 పరుగులు, నాగేష్ 67పరుగులతో నాటౌట్‌గా జట్టు విజయానికి కృషి చేశారు. ఈ టోర్నమెంట్ చివరిలీగ్ జడ్చర్ల, మహబూబ్‌నగర్ జట్ల మధ్య శుక్రవారం జరుగునున్నదని కోచ్‌లు మహేష్, ముజీబ్‌లు తెలిపారు.

అనగనగా ఓ కుటుంబం

గూడు లేదాయె.. అప్పులు భారమాయె..

- 25 ఏళ్లుగా ప్రభుత్వ ఇంటికోసం ఎదురుచూస్తున్న అభాగ్యులు
- అద్దె చెల్లించే స్థోమత లేక బడిలో తలదాచుకుంటున్న దంపతులు
- అప్పులు తీర్చేందుకు హైదరాబాదుకు వెళ్లిన కుమారుడు
- అమ్మ,నాన్నల వైద్య ఖర్చుల కోసం 2.20 ఎకరాల పొలం విక్రయం
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలంటూ నాయకులకు వేడుకోలు


అయిజ పట్టణంలోని భరత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నివాసం ఉంటున్న దంపతులు.

అయిజ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు వాళ్లు. రోజూ కూలీ నాలీ చేసుకుంటే తప్ప కడుపునిండని పరిస్థితులు వాళ్లవి. కాలం కలిసి రాక అమ్మ, నాన్నల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకే ఉన్న 2.20 ఎకరాలు వ్యవసాయ భూమిని, ఇంటిని అమ్ముకున్నారు. అయినా వారి ప్రాణాలు దక్కలేదు. కుటుంబాన్ని పోషించేందుకు ఆసరా లేక, ఉండేందుకు ఇల్లు లేక, అద్దె ఇంటికి డబ్బులు చెల్లించే స్థోమత లేక ప్రభుత్వ బడిలో తలదాచుకుంటున్న ఓ అభాగ్యుడి ఆవేదన ఇది.

25 ఏళ్ల క్రితం అయిజకు వచ్చి...

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సవారి, గోవిందమ్మల కుమారుడు ఉప్పరి బజారి. ఈయనకు 25 ఏళ్ల క్రితం అయిజకు చెందిన మాణిక్యమ్మతో వివాహం జరిపించారు. వ్యవసాయం అంతంత మాత్రంగానే ఉన్న బజారి బతుకుదెరువు కోసం వివాహం అయిన తరువాత అయిజకు వచ్చారు. భార్యాభర్తలు ఇక్కడే ఉంటూ కూలీనాలీ పనులు చేసుకుని అద్దె ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగించేవారు. 13 ఏళ్ల తరువాత బజారి తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగోలేకపోతే వారిని కూడా అయిజకు వెంటబెట్టుకొచ్చుకున్నారు. వారిద్దరి ఆరోగ్యాన్ని నయం చేయించేందుకు జక్కిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని, ఉన్న ఇంటిని అమ్మి వైద్యం చేయించినా ప్రాణాలు మాత్రం దక్కలేదు. అప్పటికే బజారి దంపతులకు ఇద్దరు, కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.3 లక్షల అప్పు

బజారి, మాణిక్యమ్మ దంపతుల కూతుళ్ల జ్యోతి, రేవతిల వివాహం చేసేందుకు గాను ఏడాదిన్నర క్రితం మూడు లక్షల రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. ఎలాగోలా అప్పుచేసి ఉన్న ఇద్దరు ఆడపిల్లలను అత్తారింటికి పంపారు. పెద్ద కూతురు జ్యోతి గర్భవతిగా ఉన్నప్పుడు తీవ్ర అనారోగ్యానికి గురికాగా వైద్యం కోసం రూ.70 వేలు ఖర్చుపెట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నట్లు ఆవేదనతో తెలిపారు.

ఈ క్రమంలో అప్పుల బాధలు ఎక్కువ కావటంతో కుమారుడు నవీన్ 8 నెలల క్రితం హైదరాబాదుకు వెళ్లి టీకొట్టు నడుపుతున్నాడు. అందులోనే అంతో కొంత మిగిల్చి ప్రతినెలా కొంత డబ్బును అప్పుల వారికి చెల్లిస్తూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నట్లు వారంటున్నారు.

నెల రోజులుగా ప్రభుత్వ బడిలోనే..

ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ఆ దంపతులకు కనీసం అద్దె ఇంట్లో ఉండాలంటే వేలకు వేలు అద్దె చెల్లించే స్థోమత లేక పట్టణంలోని భరత్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే నెలరోజులుగా తలదాచుకుంటున్నారు. వెయ్యి, పదిహేను వందల రూపాయలకు అద్దె ఇల్లు దొరక్క, అంతకంటే ఎక్కువ చెల్లించే స్థోమత వారివద్ద లేక అటుగా వెళుతున్న వారినందరినీ బడులు తెరిచేలోపు మా స్థోమతకు తగ్గ చిన్నపాటి రేకులషెడ్డు అయినా కిరాయికి ఇప్పించమని దీనంగా వేడుకుంటున్న తీరు చూస్తే కళ్లలో నీళ్ల తిరుగుతున్నాయి.

ప్రభుత్వ ఇంటికోసం ఎదురుచూస్తున్నా...



25 ఏళ్లనుంచి అయిజలో బతుకుతున్నాం. మా అమ్మ, నాన్న చనిపోవటంతో మాకు కష్టాలు మొదలయ్యాయి. అయినా నేను, నా భార్య కలిసి కూలీ పనులు చేసుకుని పిల్లలను పోషించుకుని పెద్ద చేసుకున్నాం. గవర్నమెంట్ ఇల్లు మంజూరు చేయాలని నాటినుంచి కూడా అందరిని అడుగుతూనే ఉన్నాం. ఎవ్వరు కూడా పట్టించుకోవటం లేదు. సొంతంగా అయిజలో ప్లాటు ఉంది ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే కట్టుకోవాలని ఉంది.

- బజారి, అయిజ పట్టణం

పగ వాళ్లకు కూడా మా కష్టం రాకూడదు



జీవితంలో పగవాళ్లకు కూడా మాలాంటి కష్టాలు రాకూడదు. ఉన్న ఇల్లు, పొలం అమ్ముకున్న దినం నుంచి కష్టాలు చుట్టుముట్టాయి. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్ల చేసేందుకు మూడు లక్షల అప్పు చేశాం. ఈ అప్పును తీర్చేందుకు నా కొడుకు హైదరాబాదులో టీకొట్టు నడుపుతున్నాడు. నేను గృహ నిర్మాణాల వద్ద సిమెంట్ గంపలు మోసే పనికి, మా ఆయన కట్టెల మిషన్‌లో పనికి పోతున్నాం. వెయ్యి, పదిహేను వందలకు ఎక్కువగా అద్దె చెల్లించే పరిస్థితిలో లేము.

- మాణిక్యమ్మ, అయిజ పట్టణం

ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ

- బొడ్రాళ్లు, లింగమయ్య వద్ద పూజలు చేసిన భక్తులు
- ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి


పూజా కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణంలో మూడు రోజులుగా కొనసాగుతున్న గ్రామ దేవతలు, లింగమయ్య, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం 7:56 గంటలకు పోచమ్మ, కర్రెమ్మ, కట్ట మైసమ్మ, కోట మైసమ్మ, భూ లక్ష్మమ్మ గ్రామ దేవతలు అలాగే ఐదు బొడ్రాళ్లు, నాలుగు గండ జ్యోతి దీప స్తంభాలు ప్రతిష్ఠాపన ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయా గ్రామ దేవతల ఆలయాల్లో విగ్రహాలను గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఆలయాల్లో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు పట్టణ భక్తులు వేలాదిగా తరలి వచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన అమ్మ వారి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నుంచి ఆడబిడ్డలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్మాణ కమిటీ పెద్దలు మొగిలి శ్రీధర్ గౌడ్, ఘాడి కృష్ణమూర్తి, గాడి లక్ష్మీనారాయణ, మనివర్ధన్ రెడ్డి, రవికుమార్ యాదవ్, శివానంద్, నగేష్, ఎస్ టీడీ శ్రీనివాసులు, కోట్ల వెంకటేష్, యాదగిరి, అశ్విన్ కుమార్, బాలకృష్ణ, రాము, చందు పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

తెలకపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రామ్‌రెడ్డిపల్లికి చెందిన గంటీల స్వప్న (కురువమ్మ) (38) గురువారం ఉదయం కుటుంబ విషయంలో భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం జరగగా మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైదులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు తల్లి కర్నే ఈదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్.సునీత


ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది

వనపర్తి లీగల్ కాంట్రిబ్యూటర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్.సునీత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానంలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మాత్రమే కాకుండా ప్రతీ రోజు కూడా మొక్కలు నాటడం, వాటిని కాపాడుకోవడం భవిష్యత్తు తరాలకు మంచి ప్రకృతిని అందించడం మన బాధ్యత అని ఆమె అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ జడ్జి రజని మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని భవిష్యత్తులో ప్లాస్టిక్ భూతం మానవాళికి ఎంతో హాని కలిగిస్తుందని ఆమె అన్నారు. అడవులలో ప్లాస్టిక్ వస్తువులను విసిరి వేయడం వల్ల వన్య మృగాలు వాటిని తిని అనారోగ్య పాలవుతున్నట్లు వస్తున్న వార్తలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి కళార్చన, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కవిత, జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీలత, అటవీ శాఖ అధికారులు విజయ్, రాజ్‌కుమార్, బాలకిష్టమ్మ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం


ఉప్పరిపల్లి బద్రి నారాయణ స్వామి ఆలయం ముందు ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

ఖిల్లాఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో బద్రి నారాయణ , శివాలయం, దత్తాత్రేయ స్వామి ఆలయాల ముందు గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఉత్సవాలను వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ఠను తిలకిస్తూ భక్తి తన్మయత్వంతో మునిగిపోయారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం భక్తులు ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొడుతూ నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే, ఎస్పీని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... ఆలయాల్లో ఉత్సవాలు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడతాయని అన్నారు. ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడి సందడిగా మారింది.

అనంతరం ఖిల్లాఘణపురంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి తన చిన్ననాటి స్నేహితులు గక్కెళ్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, గంగారపు చెన్నారెడ్డి, కుమార్తెల వివాహ శుభకార్యాల్లో పాల్గొని సందడి చేశారు.

కాంగ్రెస్ నాయకులు సాయి చరణ్ రెడ్డి, నరసింహా గౌడ్, దామోదర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, క్యామ రాజు, ప్రకాష్, శ్రీనివాసులు, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన


లింగమయ్య ఆలయంలో ఏర్పాటు చేస్తున్న ధ్వజస్తంభం

మక్తల్‌రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలో లింగమయ్య స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వచ్చే మంగళవారం లింగమయ్య జాతర ఉండటంతో ముందుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను గురువారం మంత్రోచ్ఛారణల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బాలిక(17) అదృశ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల ఇంటర్ పూర్తయ్యింది. గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

అండర్-19 టోర్నీలో మహబూబ్‌నగర్ జోరు

- 254 పరుగుల తేడాతో నారాయణపేటపై ఘన విజయం
- సెంచరీతో చెలరేగిన అబ్దుల్ రాఫె
- 5 వికెట్లు తీసి రాణించిన కిశోర్


గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్


5 వికెట్లు తీసి రాణించిన కిశోర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 ఉమ్మడి జిల్లా వన్‌డే క్రికెట్‌లో మహబూబ్‌నగర్ జట్టు జోరు కొనసాగుతున్నది. నారాయణపేటపై 254 పరుగుల తేడాతో గెలిచింది. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన నాల్గవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్-నారాయణపేట జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 343 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫె 127 బంతుల్లో 25 ఫోర్లు, 3 సిక్స్‌లతో సెంచరీ(165) చేశాడు. ప్రణవ్ 58 బంతుల్లో 6 ఫోర్లతో అర్ధసెంచరీ(56), రామ్‌చర్రి 31 పరుగులు చేశారు. నారాయణపేట బౌలర్లలో డీజే అకిల్ 3, రామ్‌చరణ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నారాయణపేట జట్టు 31.1 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో లోకేష్ 17, డీజే అకిల్ 10 చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో కిశోర్ 5, మనోజ్‌యాదవ్, అభినవ్ రెండు వికెట్లు తీశారు. మహబూబ్‌నగర్ జట్టును జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు. టోర్నీలో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు.

గ్రామీణ క్రీడాకారులు టోర్నీలో రాణించాలన్నారు. సెంచరీ సాధించిన అబ్దుల్‌రాఫె, 5 వికెట్లు తీసిన కిశోర్‌ను అభినందించారు. కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు మన్నాన్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తున్నాం

- ఎండీ సిరాజ్, సింగిల్ విండో సీఈవో,

పెద్దకొత్తపల్లి



పెద్దకొత్తపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయం పరిధిలోని గ్రామాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని సింగిల్ విండో సీఈవో ఎండీ సిరాజ్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో పరిధిలో ఏఏ గ్రామాలు ఉన్నాయి.?

పెద్దకొత్తపల్లి సింగిల్ విండో పరిధిలో పెద్ద కొత్తపల్లి, పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, దేదినేనిపల్లి, దేవునితిర్మలాపూర్, వెన్నచెర్ల, చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్ గ్రామాలు ఉన్నాయి.

ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు ?

సింగిల్‌విండో పరిధిలోని గ్రామాల్లో ఇప్పటి వరకు 955మంది రైతులతో 1,52,000 బస్తాల ధాన్యాన్ని అంటే 60వేల క్వింటాళ్ల 800కిలోలు కొనుగోలు చేశాం.

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడికి తరలిస్తున్నారు.?

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి రైస్‌మిల్లులకు తరలిస్తున్నాం.

ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయా?

955 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాం. ఇప్పటి వరకు 780మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశాం.

న్యూస్ బాక్స్

శ్రీపురంలో పాముకాటుతో చిన్నారి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీపురం గ్రామంలో పాము కాటుకు హర్షిత(3) అనే చిన్నారి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో శ్రీశైలం, శిరీష దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె హర్షిత గురువారం ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా పాముకాటుకు గురైంది. తక్షణమే తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

'క్యాన్సర్ కారక పత్తి విత్తనాలు సాగు చేయొద్దు'

అమ్రాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది దళారుల మాయమాటలు నమ్మి అధిక దిగుబడి పేరుతో బీటీ 3 పత్తి విత్తనాలు సాగు చేస్తే పర్యావరణానికి హాని కలగడంతో పాటు మానవాళి క్యాన్సర్ బారిన పడుతుందని మండల వ్యవసాయ అధికారి మహేష్ రెడ్డి అన్నారు. గురువారం అమ్రాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో కొంతమంది మధ్య దళారులు వ్యక్తులు బీటీ 3 పత్తి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. సాగు చేసిన రైతులతో పాటు కూలీలకు కూడా దీని దుష్ప్రభావం ఉంటుందని అన్నారు.

27న రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశం

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేష్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్, కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి జిల్లాలోని రెడ్‌క్రాస్ ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్, లైఫ్ అసోసియేట్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవేందర్ నాయక్

తిమ్మాజిపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తండాలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని, ఎవరూ అధైర్యపడవద్దని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవేంద్ర రావు అన్నారు. మండల పరిధిలోని తుమ్మల కుంటతండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభింపజేశారు. ఆయన మాట్లాడుతూ తండాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పిస్తూ ఎన్నో అభివృద్ధి పనుల తోపాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్, బద్దునాయక్, మల్లేష్‌నాయక్, రామాంజనేయ, పంచాయతీ కార్యదర్శి దీప పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం కొనసాగుతోంది. కల్వకుర్తి పట్టణంలో గురువారం జరిగిన కార్యక్రమానికి పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజశేఖర్ హాజరై రైతులకు పలు రకాల సూచనలు, సలహాలు అందజేశారు. రైతులు విత్తనాలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి, వ్యవసాయ అధికారి సురేష్, ఏఈవో, రైతులు ఉన్నారు.

నీరు వృథా.. జనం వ్యథ

- మిషన్ భగీరథ పైపులు లీకేజీ
- నెల రోజులుగా ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

ఊర్కొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తండాలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తండాకు మిషన్ భగీరథ నీరువచ్చే పైపులు లీకేజీల కారణంగా నీటి గోస ఏర్పడింది. మండలంలోని ఊర్కొండపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఠాకూర్ తండాలో సుమారుగా 300 జనాభా ఉంటుంది. మిషన్ భగీరథ నీరుతో తాగునీటి సమస్య లేకుండా ఉన్నటువంటి గిరిజనులకు ఉన్నఫలంగా ఊర్కొండపేట గ్రామం నుంచి తండాకు వచ్చే పైపులు రెండు చోట్ల భారీ లీకేజీ కారణంగా తండాకు నీరు రావడంలేదు. అదేవిధంగా మండలంలోని నర్సంపల్లి గ్రామంలోనూ తాగునీరు లేక మూడు రోజులుగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారుగా 600 జనాభా ఉంది. వారికి మిషన్ భగీరథ నీరు తప్ప గ్రామాల్లో ఎలాంటి బోరుబావులు లేవు. మూడు రోజుల క్రితం గ్రామానికి వచే మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో గ్రామానికి చుక్క నీరు రావడం లేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మిషన్ భగీరథ పైపుల లీకేజీ కారణంగా తాగునీరు రావడంలేదని, వాటిని సరి చేయాలని మొరపెట్టుకున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. నెల రోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు.



ఊర్కొండపేట నుంచి ఠాకూర్ తండా రోడ్డులో లీకేజీ



నర్సంపల్లి వెళ్లే మిషన్ భగీరథ పైపు లీకేజీ

లీకేజీ సరి చేయాలి



పైపులు పగిలినా అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు తాగునీరు లేక అవస్థలుపడుతున్నాం. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టిం చుకోవడం లేదు. అధికారులపై చర్యలు తీసుకో వాలి. మాకు మిషన్ భగీరథ నీరు అందించాలి.

- లచ్చిరామ్ నాయక్, ఠాకూర్ తండా

తాగునీటికి అవస్థలు పడుతున్నాం



మా గ్రామానికి మిషన్ భగీరథ నీరు వచ్చే పైపులైన్ పగిలిపోవడంతో చుక్కనీరు రావడం లేదు. అధికారులకు తెలిపినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. పైపులైన్ను పునరుద్ధరించాలి

- పోలె లక్ష్మణ్, నర్సంపల్లి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కందనూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినం పురస్కరించుకొని జిల్లాలో పలు సంస్థల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారులు, అటవీశాఖ అధికారులు, జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, ఉప్పునుంతలలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో, వంగూరులో ఎంపీడీవో ఆధ్వర్యంలో, అమ్రాబాద్‌లో ఉపాధి హామీ పథకం ఏపీవో ఆధ్వర్యంలో మొక్కలు నాటి, ర్యాలీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని వక్తలు సూచించారు. అడవులు అంతరించిపోవడం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

● ప్రపంచ పర్యావరణ దినాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వెంకట్‌రామ్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.శ్రీనిధి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.రవికాంతారావు, జనరల్ సెక్రటరీ ఎం.మధుసూదన్‌రావు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ దేవరాజు, ఇతర ఫారెస్టు అధికారులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి : కల్వకుర్తి కోర్టు ఆవరణలో న్యాయాధికారులు ఏ.శ్రీదేవి, జే.కావ్య మొక్కలు నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు సూపరింటెండెంట్ ఆనంద్, జూనియర్ సివిల్‌కోర్టు సూపరింటెండెంట్ సత్యం, కోర్టు సిబ్బంది చంద్రశేఖర్, ఆలివేల, స్వరూప, అనిల్, సి.శ్రీలత, డి.శ్రీ లత, జూనియర్ సివిల్ కోర్టు సిబ్బంది పార్వతమ్మ, స్వామి, రాజేంద్ర ప్రసాద్, దినేష్, శంకర్, పారిజాత, దేవి, మౌనిక, మాధవి, ఏసీజీ వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు, మునిసిపల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● దోమలపెంట : అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో గురుప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా గురువారం వటువర్లపల్లిలో దోమలపేంట రేంజ్ పరిధిలోని అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి వెంట ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అమ్రాబాద్ అభయారణ్యంలో ప్లాస్టిక్ వాడటం నిషేధించేందుకు గత సంవత్సరం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా జనాలు అంతగా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు ధర్మానాయక్, రామాంజనేయులు, బషీర్, తాజుద్దీన్, ఎఫ్‌బీవోలు తేజశ్రీ, శిల్ప, రాజేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్ : పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు జీవం పోస్తుందని అచ్చంపేట ఫారెస్టు అధికారి సుబూర్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో ఫారెస్టు సిబ్బంది పర్యావరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి మహ్మద్ ఇర్ఫాన్, సీనియర్ అధ్యాపకులు అంజయ్య, ఉమాదేవి, రామకృష్ణ పాల్గొన్నారు.



కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్

● ఉప్పునుంతల : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినం పురస్కరించుకొని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి స్వప్న ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు, ఏఎన్ఎంలు, హెల్త్‌అసిసెంట్లు ఉన్నారు.

● వంగూరు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఎంపీడీవో బ్రహ్మచారి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. ఏపీవో శివశేఖర్‌గౌడ్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండల పరిధిలోని మన్ననూరు గ్రామానికి చెందిన ఒక రైతు వ్యవసాయ పొలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి ఏపీవో రఘు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీఏ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణా నాయక్ ఉన్నారు.

● ఏకల్ గ్రామోదయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అమ్రాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హరీష్ గౌడ్, వివేకానంద యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా అరికట్టాలి

- అమ్రాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన హిందూ వాహిని సభ్యులు

అమ్రాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని హిందూ వాహిని అమరేశ్వర ఆలయ కమిటీ వివేకానంద యూత్ ల ఆధ్వర్యంలో గురువారం అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కాని స్టేబుల్ కృష్ణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందచేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశంలోనే అరుదైన తూర్పు పొడ జాతి ఆవులు నల్లమల ప్రాంతంలో అత్యధికంగా ఉన్నాయని వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అమరేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి నాగరాజు, వివేకానంద, యూత్ అధ్యక్షులు నోముల పరమేష్ గౌడ్, హిందు వాహిని కమిటీ అధ్యక్షులు శంకర్ గౌడ్, అక్షితగౌడ్, రాఖి తదితరులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న హిందూ వాహిని సభ్యులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయమని పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి రూ.5.30లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీలను ఆయన పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వి.సత్యం, మాజీ ఎంపీటీసీ రవికుమార్, నాయకులు బాలింగాచారి, పుట్ట రాములు, పుట్ట అంజనేయులు, ఇమామ్‌గౌడ్, కే.నారాయణగౌడ్, పటేల్ రాములు, బండారి రాముడు, జి.రాముడు, బైరాజు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. దేవాలయ నిర్మాణానికి రాఘవేందర్‌రెడ్డి రూ.5లక్షలు సమకూర్చారు. దేవాలయంలో భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాలయాల నిర్మాణానికి, సామాజిక సేవ కార్యక్రమాలకు ఐక్యత ఫౌండేషన్ చేయూతగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు రాఘవేందర్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి

అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటించని అల్లాపూర్ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావుకు ఫి ర్యాదు చేశారు. కాశన్న మాట్లాడుతూ తాడూరు మండలం అల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్‌రెడ్డి కార్యాలయానికి సమయానికి రాకపోగా, వచ్చినా ప్రజలు వారి సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరిస్తారని ఆరోపించారు. అల్లాపూర్ గ్రామానికి చెందిన కురుమయ్య అనే వ్యక్తి తన అవసరం నిమిత్తం నివాస ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని కోరితే పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి పనితీరుపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కురుమయ్య, పార్వతమ్మ, లక్ష్మణ్, వెంకటయ్య పాల్గొన్నారు.

గ్రామాల వరకు రెవెన్యూ సేవలు

- కలెక్టర్ బదావత్ సంతోష్ - ప్రజల అర్జీలపై కలెక్టర్ నేరుగా పరిశీలన

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయి వరకు రెవెన్యూ సేవలను ప్రభుత్వం అందిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం రానుందని ఆయన పేర్కొన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో ముఖాముఖిగా కలెక్టర్ చర్చలు జరిపి వారు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను సవివరంగా తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో అవి ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయా అని అధికారులను ప్రశ్నించారు. దరఖాస్తు నమోదు ప్రక్రియలో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని స్వీకరించిన ప్రతీ దరఖాస్తుకు రసీదులు ఇవ్వాలని, సంబంధిత రిజిస్టర్‌లో స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సదస్సులో హెల్ప్ డెస్క్‌లను, నమోదు పత్రాలను, విభజన విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ సమస్యల ప్రకారంగా దరఖాస్తులను వర్గీకరించి పక్కాగా రికార్డు చేయాలని సూచించారు. జూన్ 20వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూములపై సమస్యలు ఉన్న ప్రజలు సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్ పక్కన ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం

భూ భారతిపై సర్వేయర్లకు అవగాహన

నాగర్‌కర్నూల్ : భూభారతి చట్టం అమలులో భూముల కొలతల్లో సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో గల రైతు వేదికలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జూలై 28, 29 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం పరీక్షను నిర్వహిస్తుందని ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పొలాల్లో స్వయంగా సర్వేచేయించి కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భూమి కొలతలు, సరిహద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు వంటి అంశాలపై సర్వేయర్లకు ఆచరణాత్మక శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా ఏడీ సర్వేయర్ నాగేందర్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా నిర్ణయించడం సరికాదు

- మునిసిపాలిటీ వార్డుల విభజనపై బీజేపీ నాయకుల వినతి

కొల్లాపూర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీలో వార్డులను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిపి ఏకపక్షంగా నిర్ణయించడం సరికాదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్ విమర్శించారు. 20వార్డులుగా ఉన్న కొల్లాపూర్ మునిసిపలిటీలో ఒక దఫా పరిపాలన ముగిసింది. ప్రస్తుతం మునిసిపాలిటీలో 14వ వార్డుగా ఉన్న తాళ్ల నర్సింగాపురం గ్రామాన్ని తిరిగి గ్రామ పంచాయతీగా మార్పు చేసి మునిసిపాలిటీని 19 వార్డులుగా విభజించారని తెలిపారు. అలా కాకుండా 19వార్డులను 20 వార్డులుగా విభజిం చాలని బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొల్లా పూర్ మునిసిపాలిటీ కమిషనర్ శ్రీనివాసన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ మునిసిపాలిటీ అధికారులు ఏకపక్షంగా 19వార్డులుగా నిర్ణయించారని అలాగే కొన్ని వార్డుల్లో ఓటర్లు ఎక్కువగా, మరికొన్ని వార్డుల్లో తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. అలా కాకుండా అన్ని వార్డులలో సమాన ఓటర్లు ఉండే విధంగా వార్డుల విభజ న చేసి 20వార్డులుగా విభజన చేయాలని బీజేపీ నుంచి డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు మరొకసారి పరిశీలించి నిర్ణయం తీసుకొని కొల్లాపూర్ ప్రజలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కాశీపురం మహేష్, బడా చందు యాదవ్, బొమ్మరిల్లు భాస్కర్, బాలపీరు, సత్యం సాగర్, పాలడుగుల కురుమయ్య, మల్లికార్జున్, శ్రీను, అరుణ తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొనసాగుతున్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

కందనూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీపురం శ్రీరంగ నాయకస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం, మధ్యాహ్నం గరుడ ముద్ద తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఉదయం రంగనాథ స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్వకుర్తి సమగ్రాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణాభివృద్ధికి కావాల్సిన నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో గురువారం పలు సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. భగత్‌సింగ్ తండాలో రూ.15లక్షలు, కేశవనగర్‌లో రూ.25లక్షలు, రాఘవేంద్రకాలనీలో రూ.22లక్షలు, బాలరామ్‌నగర్‌లో సీసీరోడ్లు, 8వ వార్డు సుభాష్‌నగర్‌లో రూ.25లక్షలు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పది లక్షలతో నిర్మించే డ్రైనేజీలకు, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో మునిసిపల్ మెప్మా ఆధ్వర్యంలో చేతి వృత్తులద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కల్వకుర్తిలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇది వరకే సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, కాంగ్రెస్ పట్టణఅధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, పలువురు మాజీకౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా కాలనీల ప్రజలు ఉన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

భూ భారతి రెవెన్యూ సదస్సులను

సద్వినియోగం చేసుకోవాలి

- కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ వెల్లడి

పెద్దకొత్తపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం అమల్లో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. గురువారం పెద్దకొత్తపల్లి మండలం తిర్నాంపల్లి, చంద్రకల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 170 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్‌లు తెలిపారు. సదస్సుల్లో తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, ఆర్ఐలు, మాజీ సర్పంచ్ సాలయ్య, వివిధ పార్టీల నాయ కులు శ్రీని వాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఉప్పునుంతల : మండల పరిధిలోని కొరటికల్, జప్తిసదగోడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప తహసీల్దార్ పరుష్‌నాయక్ ఆర్ఐ సుజాత బాలరాం నాయక్ ఉన్నారు.

● చారకొండ : మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులోతహసీల్దార్ సునీత పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఎంఆర్ఐ భరత్‌కుమార్ గౌడ్, జూ.అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

● వంగూరు : మండలంలోని ఉమ్మాపూర్, అన్నారం గ్రామాల్లో తహసీల్దార్ మురళీమోహన్ ఆధ్వర్యంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐలు పాల్గొన్నారు.

● తాడూరు : మండలంలోని చెర్లతిర్మలాపూర్, అంతారం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ జయంతి పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా రెండు టీమ్‌లుగా విభజించి గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహహ్మద్‌అలీ, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చారకొండ : రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సునీత